www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య

ఆర్‌బికెల్లో పసుపు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

పసుపు పంటను అమ్ముకోదలచిన రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్ బి.త్యాగ్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేట, కోడూరు, చిట్వేల్, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు, వీరబల్లి ఓబులవారిపల్లి మండలాల్లో సుమారుగా 827 ఎకరాలలో 667 మంది రైతులు పసుపు పంటను సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.4800 నుంచి 5200 వరకు ఉందన్నారు. ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధర రూ.6,850 ఇవ్వనుందన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన రైతులు ఆర్‌బికెల్లో సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసి పసుపు దిగుబడులను కొనుగోలు చేస్తామని తెలిపారు.

భూబకాసురుల భరతం పడతా

- టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు

మాజీ మంత్రి వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/బద్వేలు

బద్వేల్‌లోని భూబకాసురుల భరతం పడతామని, భూబాధితులకు తిరిగి వారి భూములు వారికి ఇప్పిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం బద్వేల్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి కీ.శే బిజీవేముల వీరారెడ్డి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పంచాయతీ సమితి బోర్డు సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించి తిరుగులేని నేతగా ఎదిగారని కొనియాడారు. ఆయన పట్ల ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి వాటిల్లుతున్న నష్టాన్ని ఓటర్లకు వివరించాలన్నారు. టిడిపి హయాంలో చేపట్టిన రంజాన్ తోఫా, అన్న క్యాంటిన్, విదేశీవిద్య వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఒక అసమర్థుడు పాలన సాగిస్తే ఏమి జరుగు తుందో అనుభవంలోకి వస్తోందన్నారు. రిలయన్స్ సోదరుల్లో ఒకరు ఆసియాలో నెంబర్ వన్‌గా నిలిస్తే మరొకరు నామమాత్రంగా మిగిలి పోయారని గుర్తుచేశారు. టెక్నాలజీలో రెవల్యూషన్ తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. ఎన్‌హెచ్ పాలసీ ద్వారా తమిళనాడు నుంచి నెల్లూరు వరకు జాతీయ రహదారిని నిర్మించామన్నారు. త్వరలో బద్వేల్‌కు ఔటర్ రింగురోడ్డు వస్తుందని తెలిపారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ బద్వేల్‌లో టిడిపి అభ్యర్థిని గెలిపించి అధ్యక్షులు చంద్ర బాబుకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇవ్వడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తా సైనికుడై పని చేయాలని తెలిపారు. యువ నాయకుడు రితేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ తాత బిజీవేముల వీరారెడ్డి ఆశయాలకు వారసునిగా వచ్చానని తెలిపారు. తనకు కార్యకర్తలే బలమూ, బలహీనతా అని చెప్పారు. సోమశిల వెనుకజలాలు, కుందూ నుంచి ఐదు టిఎంసిల నీళ్లు ఇస్తామన్న పాదయాత్ర హామీ ఏమైందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను పరోక్షంగా ప్రశ్నించారు. బద్వేల్ భూదందాపై కమిషన్ వేయాలన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఓబుళాపురం రాజశేఖర్ మాట్లాడుతూ 2019లో బద్వేల్‌కు టిఎంసి నీటి తరలింపునకు ఇచ్చిన జివో బుట్టదాఖలు కావడం ఆందోళనకరమని తెలిపారు. ఫలితంగా మూడు మండలాలకు నీటి చుక్క కరువై అలమటిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరోసభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, అమీర్‌బాబు, టిడిపి నాయకులు రితేష్‌రెడ్డి, బొగ్గుల గుర్రప్ప, ఓబులాపురం రాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

పోరుమామిళ్ల : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బద్వేల్ పర్యటన ముగించుకుని గిద్దలూరుకు వెళుతూ పోరుమామిళ్ల పట్టణంలోని గాంధీ బొమ్మ సర్కిల్‌లో ఆగి మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్‌తో కలిసి గాంధీ బొమ్మకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడును సుధాకర్ దంపతులు శాలువతో సన్మానించారు.

చంద్రబాబుకు శ్వేతారెడ్డి సన్మానం

కాశినాయన : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండల పరిధిలోని ఓబులాపురం క్రాస్ వద్ద తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు మహిళా అధ్యక్షులు కర్నాటి శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో భారీ జన సమూహంతో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నర్సాపురం మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బారెడ్డి నరసాపురం ప్రజలు బాలరాజుపల్లె, సావిశెట్టిపల్లె, బాలయ్యపల్లె, ఉప్పలూరు, మిద్దెల వద్ద స్వాగతం పలికారు.

'దాతలూ.. మాబిడ్డను ఆదుకోండి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దాతలు ఆదుకోవాలని కోరుతున్న కల్పన

పెద్ద పేగుపైన చర్మం పెరిగి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న హేమంత్ కుమార్ శస్త్ర చికిత్స కోసం దాతలు సాయం చేసి ఆదుకోవాలని తల్లి కల్పన కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కల్పన తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. కల్పన, సురేంద్ర తనయుడు హేమంత్‌కుమార్ పట్టణంలోని చలపతి రావు కాలనీలో నివాసం వుంటున్నారు. తండ్రి సురేంద్ర హోటల్‌లో సప్లైయర్‌గా, తల్లి కల్పన టైలర్ వృత్తి నిర్వహిస్తున్నారు. హేమంత్ కుమార్ వయసు ప్రస్తుతం 10 సంవత్సరాలు, పుట్టుకతోనే అనారోగ్యంతో బాధపడుతున్నారు. చిన్నప్పటి నుంచి తిరుపతి, బెంగుళూరు ప్రాంతాలలో ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించి పేగు సంబంధిత వ్యాధిగా నిర్ధారించిన వైద్యులు చికిత్స ఇస్తున్నారు. బెంగుళూరు ఇందిరా గాంధీ హాస్పిటల్ చికిత్స ఇచ్చిన తరువాత ఆపరేషన్ చేయడానికి బాలుడి శరీరం సహకరిస్తుందా లేదా అనే పరీక్షలను బెంగుళూరు మణిపాల్, సెయింట్ జాన్ హాస్పిటల్ పర్యవేక్షణ నిర్ధారణ చేశారు. ఆపరేషన్ కోసం సుమారు రూ.5లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారని, పేదవారమైన తమకు అంత డబ్బు ఖర్చు పెట్టే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి, ఇంటిలోని సామగ్రి అమ్మకం చేసి వైద్యం చేయించామని అన్నారు. ఆర్థిక పరిస్థితి దయనీయంగా వున్న సమయంలో హేమంత్ కుమార్ ఆపరేషన్ కోసం దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. తన భర్త సైతం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డ హేమంత్ కుమార్ శస్త్రచికిత్స కోసం సాయం చేయాలనుకునే వారు 9502768558 నంబర్‌కు ఫోన్ చేసి ఆదుకోవాలని చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మెప్మాలో విచ్చలవిడిగా అవినీతి : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజలో ప్రతి మనిషి వెనుక స్త్రీమూర్తి ఉందని, అలాంటి వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా వ్యవస్థను తీసుకువచ్చారని, ఆ సంఘాల అభివృద్ధికి మెప్మా సంస్థలు ఏర్పాటు చేశారని మదనపల్లి నియోజకవర్గం టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వ్యవస్థలను అధికారంలో వున్న వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా మదనపల్లి మెప్మా అవినీతిమయంగా మారిందన్నారు. రవి అనే సిఇఒ రూ.1.5 కోట్లు అవినీతికి పాల్పడి పరారీలో ఉన్నాడని, అతనిపై ఇంతవరకు కేసు లేదని, అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇదే వ్యక్తి గతంలో చిత్తూరులో పనిచేసినప్పుడు రూ.2.5 కోట్లు అవినీతికి పాల్పడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటివరకు రూ.2 నుండి రూ.3 కోట్లు అవినీతి జరిగిందని, ఈ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయాలన్నారు. ఆర్పీలపైన వేధింపులు అధిక మయ్యాయని, దీంతో వారు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన రోజుల్లో డ్వాక్రా మహిళల గృహ నిర్మాణాల కోసం రూ.4 కోట్ల మంజూరు చేశానని, విషయాన్ని గుర్తుచేశారు. దాచుకో, ఉంచుకో, పంచుకో విధానంతో వైసిపి పాలన సాగిస్తోందని విమర్శించారు. కొత్తగా రుణాలు కావాలంటే ముడుపులు ఇవ్వాల్సిందేనని ఆరోపించారు. మదనపల్లి మెప్మాలో జరిగిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని, అవినీతికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున మహిళలతో కలసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగూర్ వలి, పఠాన్ ఖాదర్ ఖాన్, గిరీష్ కుమార్, షంషీర్, ఇంతియాజ్, వేమయ్య, శ్రీరాములు, బండి అమర, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణ పనులును బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. పనుల నాణ్యత పైఆరా తీశారు. త్వరితగతిన పనులును పూర్తి చేయాలని సూచిం చారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, సివిల్ సప్లైస్ రాష్ట్ర డైరెక్టర్ పోలుసుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, గౌస్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, వాల్మీకి సంఘ జిల్లాఅధ్యక్షుడు గువ్వలబుజ్జిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యాలయ పనులు పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రమాదాల నివారణకు చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణకు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. బుధవారం డిఎస్‌పి బంగ్లాలో నేషనల్ హైవే, మున్సిపల్, ఆర్‌అండ్‌బి అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎక్కువగా వాహన ప్రమాదాలు జరుగు తున్నాయన్నారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగు తున్నాయో ఆ ప్రాంతంలో నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారుల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగి ప్రజలు, విద్యార్థులు, యువకులు, ప్రయాణికులు చనిపోవడం జరుగు తుందన్నారు. ఒక ప్రమాదం జరిగితే అందులో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబ వీధిన పడే అవకాశం ఉందన్నారు. వాహనదారులు, డ్రైవర్లు, యజమానులతో సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదల వల్ల జరిగే నష్టాలను వారికి తెలపాలని సూచించారు. అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకర మలు పులు వద్దే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారుల్లో దూరం ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్ప నిసరిగా ధరించాలని చెప్పారు. ఎస్‌పి గంగాధర్ రావు సూచ నలు మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ నడుం బిగించాలని సూచిం చారు. సమావేశంలో ఆర్‌డిఒ దినేష్ చంద్ర, నేషనల్ హైవే డిఇ శివరాం, మున్సిపల్ డిఇ పల్లవి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు భూములు పంచాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని సీతారాంపురం గ్రామపంచాయతీలో గల ప్రభుత్వ బంజర భూములను ఎనిమిదో విడత అసైన్మెంట్ కమిటీ ద్వారా పంచాయితీ పరిధిలోని దళిత, గిరిజనులకు కేటాయించి పంచాలని బికెఎంయు జిల్లా అధ్యక్షులు పండుగోల మణి డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీలో వారు పర్యటించి సర్వేనెంబర్ 162 ఖాతా నెంబర్ 1405లో గల సుమారు 673 ఎకరాల 90సెంట్లు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బంజర భూమిలో గ్రామపంచాయతీ లోని ఎస్‌సి, ఎస్‌టిల ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి భూ పంపిణీ కార్యక్రమాన్ని 7 విడతలుగా నిర్వహించి అసైన్మెంట్ కమిటీ ద్వారా నిరుపేద దళిత గిరిజన కుటుంబాలకు ఒకటిన్నర ఎకరా చొప్పున భూ పంపిణీ చేశారని గుర్తు చేశారు. టిడిపి హయాంలో ఎక్కడా ఒక్క సెంటు భూమి కూడా పంచిన పాపాన పోలేదని అన్నారు. రాజకీయ నాయకులు, పెత్తందారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ బంజర భూములను తక్షణమే రెవెన్యూ యంత్రాంగం స్వాధీనపరచుకొని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వ్య.కా.స ఆధ్వర్యంలో ప్రభుత్వ బంజర భూముల్లో ఎర్రజెండాలు నాటి నిరుపేదలకు పంచుతామని రెవిన్యూ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు బీదం రాజశేఖర్, కార్యదర్శి గుడిసె నరసింహులు, ఉపాధ్యక్షులు చలంపాటి నరసింహులు, సహాయకార్యదర్శి కోడూరు రవి పాల్గొన్నారు.

భూమిని పరిశీలిస్తున్న బికెఎంయు నాయకులు

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

జగనన్న కాలనీ పనుల పరిశీలనలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-కురబలకోట

జగనన్న కాలనీలలో లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముదివీడు, బ్రాహ్మణవడ్డేపల్లి, కంటేవారిపల్లి జగనన్న కాలనీ లేఅవుట్‌లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ముదివీడు(కడప క్రాస్) జగనన్న లేఔట్ లో 115 పట్టాలు మంజూరైతే 92 ఇళ్లు మంజూరు అయ్యాయని ఇప్పటి వరకు 24 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎప్పటికప్పుడు బిల్లులు పడుతున్నాయా అని లబ్ధిదారులను కలెక్టర్ అడగగా సకాలంలో బిల్లులు పడుతున్నాయని లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. బిఎల్ దశలో ఉన్న 32 ఇళ్లు ఎందుకు ఆర్‌ఎల్ దశలోకి తీసుకు వెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు. ముదివీడు విఆర్‌ఒ ఇంటి పట్టాల విషయంలో తమను ఇబ్బంది పెడుతున్నారని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విఆర్‌ఒపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లేఔట్ లో అదనంగా మరో బోరు వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బ్రాహ్మణవడ్డేపల్లి జగనన్న కాలనీ లేఅవుట్లను కలెక్టర్ పరిశీలించి ఇంకా పునాది దశలో 21 ఇల్లు ఉన్నాయని వాటిని త్వరగా ఆర్‌ఎల్ దశకు తీసుకురావాలన్నారు. ఆర్‌ఎల్ దశలో ఉన్న పది ఇళ్లు స్లాబ్ దశకు చేరుకోవాలన్నారు. ఈ లేఔట్‌లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు కలెక్టర్‌ను కోరగా త్వరగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కాలనీ లేఔట్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు కొన్ని ఒరిగిపోయి ఉండడంతో ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి విద్యుత్ స్తంభాలు బాగా ఉండేలా చూడడంతో పాటు త్వరగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. లబ్ధిదారులందరని స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్చి ప్రభుత్వం తరఫున సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. కంటేవారిపల్లి జగనన్న కాలనీ లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించి మొత్తం ఎన్ని ప్లాట్లు, ఎన్ని ఇల్లు మంజూరు చేశారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పట్టాలు తమకు ఇవ్వలేదని లబ్ధిదారులు కలెక్టర్ కోరగా వారం లోపు పట్టాలు లబ్ధిదారుల చేతిలో ఉండాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి విద్యుత్, నీటి సరఫరా లేదని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్, నీటి సరఫరాకు స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. లబ్ధిదారులు నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుక రాగా వారం రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఆర్‌డిఒ మురళి, హౌసింగ్ పీడీ శివయ్య, ఎంపిడిఒ, తహశీల్దార్, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

'స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి'

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్త స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి నారాయణ భరత్ గుప్తతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ నుంచి కలెక్టర్ గిరీష, డిఆర్‌ఒ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల పథకాలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలలో ఆయా శాఖల ద్వారా ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలను సంతృప్తస్థాయిలో అందించాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా అందుతున్న అర్జీలను నాణ్యవంతంగా పరిష్కరించడం ద్వారా ఎక్కువ శాతం ప్రజల సమస్యలు తొలగి అధికారులపై ఒక మంచి నమ్మకం ఏర్పడుతుందన్నారు. స్పందనకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఒక అనాలసిస్ చేశామని, ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి, హెూమ్, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం తదితర 5 శాఖలకు సంబంధించి అర్జీలు తరచు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలలో కూడా స్పందనలో అర్జీలు ఎక్కువగా వస్తున్న మొదటి ఐదు శాఖలను గుర్తించాలని చెప్పారు. రెవిన్యూ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గృహ నిర్మాణం తదితరాలలో తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. స్పందనలో ఏ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి, ఎందులో వస్తున్నాయి, ఏ శాఖకు సంబంధించి ఎక్కువగా వస్తున్నాయనే అంశాలలో జిల్లాస్థాయి అనాలసిస్‌ను రూపొందించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, సచివాలయాలలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాములు అమలు చేయాలని, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ, సచివాలయాలలో మెరుగైన సేవలను అందించేలా జిల్లా అధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులు, సిబ్బందిని పర్యవేక్షణ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఒ రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్పులబాధతో దంపతుల బలవన్మరణం

ప్రజాశక్తి-చెన్నూరు

ఆత్మహత్య చేసుకున్న యువ దంపతులు సాయి, హేమామాలిని (ఫైల్‌ఫొటో)

చెన్నూరులో విషాదం చోటు చేసుకుంది. వివాహం జరిగిన ఏడాదికే దంపతులు సాయికుమార్‌రెడ్డి(30), హేమమాలిని (28) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటి అవసరం నిమిత్తం తన భూమిని తనకా పెట్టి ఒక వ్యక్తికి వద్ద రూ.3 లక్షల అప్పుచేసి, తిరిగి ఆ అప్పును ఇచ్చి తన భూమిని తనకు ఇవ్వాల్సిందిగా కోరితే ఇవ్వక పోగా పోలీస్ స్టేషన్లకు తిప్పి వేధించారు. తమకు న్యాయం జరగదని భావించి 8 నెలల గర్భిణీ అయిన తన భార్యతో ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చెన్నూరులో చోటు చేసుకుంది. మృతుని తల్లి వరలక్ష్మి వివరాల మేరకు... సాయి కుమార్‌రెడ్డి కడప నగరం పాలెంపల్లికి చెందిన నారాయణ స్వామికి రూ.మూడు లక్షలకు ఆయకానికి పెట్టారు. ఆయకానికి పెట్టే ముందు తన డబ్బు వడ్డీతో సహా ఎప్పుడైనా చెల్లించండి, మీ భూమి మీకు తిరిగి ఇస్తానని నారాయణస్వామి చెప్పారు. ఇటీవల డబ్బు తీసుకొని తన భూమి తనకు ఇవ్వాలని సాయి కుమార్‌రెడ్డి నారా యణస్వామిని అడుగగా అతను ఇవ్వకపోగా అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టాడు. నారాయణస్వామి పోలీసులతో బెదిరించాడు. మానసికంగా వేధించడంతో మనస్థాపంతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కడప రైల్వే ఎస్‌ఐ రారాజు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి కనుమలోపల్లె నుండి కడప మార్చురీ, చెన్నూరు వరకు యువ దంపతుల మృహదేహాల అంత్యక్రియల ముగిసేంత వరకు దగ్గరుండి అన్ని కార్యక్రమాలు చూశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆ కుటుంబానికి అండదండగా నిలబడ్డారు.

సాయిది ప్రేమ వివాహం : సాయి కుమార్‌రెడ్డి, హేమ మాలినితో కులాంతర ప్రేమ వివాహం చేసు కున్నారు. వారు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కడప నగరంలోని దుర్గమ్మ కాలనీలో సంసారం ఉంటు న్నారు. సాయి కుమార్‌రెడ్డి ఈకామ్ వాటర్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచే స్తు న్నారు. హేమమాలిని రియల్ ఎస్టేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు : యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త మండల వ్యాప్తంగా వ్యాపించడంతో అటు రామనపల్లి, ఇటు చెన్నూరు భవాని నగర్‌లో విషాదఛాయలు అలుము కున్నాయి. వారిని కడసారిగా చూసేందుకు గ్రామస్తులు తరలి వచ్చారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి ట్రాన్స్‌కోలో ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని ఇఇ సురేంద్ర నాయుడు తెలిపారు. స్థానిక జడ్‌పిస్కూల్‌లో ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న సిబ్బందికి మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎపి ట్రాన్స్‌కోలో ప్రమాదాలు జరగ కుండా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం ఎడి ఎంఆర్‌సి మనోహర్‌రెడ్డి, ఎఇ సాల్మన్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మోడీని ఇంటికి పంపేందుకే ప్రజాభేరి

మదనపల్లె అర్బన్: లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. బుధవారం ప్రచారభేరి ఆరవ రోజు మదనపల్లి హెడ్‌పోస్ట్ ఆఫీసు వద్ద నుండి బెంగుళూర్ బస్టాండ్ వరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు టి.హరేంద్రనాథ్ శర్మ, కె.మురళి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ విలువలను తిరగరాస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ విధానాల అవలంబిస్తూ కార్మిక శ్రామిక ప్రజలను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఏపీకి ఇచ్చినటువంటి ఏ హామీని నెరవేర్చలేదని, విభజనహామీలను అమలు చేయలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, పోలవరంకు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. మోడీమోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక బిల్లులు అన్నిటికీ వైకాపా ప్రభుత్వం పూర్తిగా సపోర్ట్ చేస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాల దెబ్బతీస్తున్న రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రైతాంగ వ్యతిరేక బిల్లులను చట్టాలుగా మారుస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వాటిని బలపరుస్తున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రమాద కరమైనటువంటి పరిస్థితుల్లో పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు తిరుమల ఓబులేసు, అనసూయ పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులను కాపాడుకుందాం

రాయచోటి: గ్రామీణ ప్రాంత ప్రజల మనుగడ ఉమ్మడి వనరులపై ఆధారపడి ఉందని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ రాణిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల అభిరుచి రెస్టారెంట్‌లో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి వనరుల సంరక్షణ, అభివృద్ధిపై జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులతో ఒక్కరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వనరుల అభివృద్ధే లక్ష్యంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న సంస్థ ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ అని, ఉమ్మడి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఉమ్మడి వనరులను అభివృద్ధి చేసుకొని రక్షించుకుంటే జీవనోపాదులు మెరుగుపడతాయని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1800 లకు పైగా ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితిలు ఏర్పాటు చేయడం జరిగిందని, 67వేల ఎకరాల ఉమ్మడి భూమిని మ్యాపింగ్ చేసి అభివృద్ధి పనులు గుర్తించి, పిఒబిలో నమోదు చేశామన్నారు. అన్ని మండలాల్లో ఉమ్మడి వనరుల అభివృద్ధిపై గ్రామ సర్పంచులకు, ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ద్వారా మ్యాపింగ్, క్లార్ట్, వెల్ మానిటరింగ్ వంటి టెక్నికల్ యాప్స్ డిజైన్ చేసి ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. స్వచ్ఛంద సంస్థలకు టెక్నికల్ పరంగా ఉచితంగా ఎఫ్‌ఇఎస్ సంస్థ సహాయ సకహారాలు అందిస్తుందని, భవిష్యత్తులో స్వచ్ఛంద సేవాసంస్థలతో కలిసి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ధన శేఖర్, శ్రీనివాస్, విశ్వేశ్వర, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులు అతావుల్లా, సురేంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, కవిత, నాగేశ్వరరావు, రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న జంగా రాఘవరెడ్డి

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

ప్రజాశక్తి-కురబలకోట

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి నాయకులు అభిప్రాయపడ్డారు. మాజీ మండల అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి తెట్టు రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం కురబలకోట మండలం కనసానివారిపల్లె పంచాయతీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 'చంద్రన్నే మా భవిష్యత్ మీతోనే రాష్ట్ర అభివృద్ధి 'పేరుతో స్టిక్కర్ ఆవిష్కరించారు. అనంతరం సిద్దారెడ్డిగారిపల్లె, ఎగువపల్లి, దిగువపల్లి, దిగువపేయపల్లె, బుడ్డారెడ్డిగారిపల్లె, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రజలు సానుకూలంగా స్పందించి స్టిక్కర్లు అంటించుకోవడానికి ముందుకు రావడం విశేషం. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి బదులు అరాచకాన్ని అభివృద్ధి చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని ఒక్కొక్కరిపై రూ.2లక్షలకు పైగా అప్పు ఉందన్నారు. అప్పులు, నిరుద్యోగత, అరాచకం, దోపిడీలు పెరిగిపోయాయన్నారు. శాంతిభద్రతలు లోపించి ప్రజల్లో అభద్రతా భావం పెరిగిపోయిందన్నారు. జనాల్ని నమ్మించి మోసం చేయడంలో జగన్ దిట్టని ఆరోపించారు. మంచి విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం నర్సింహులు, లక్ష్మన్న, అయ్యారెడ్డి, వెంకటరమణారెడ్డి, కె.సి.రామచంద్ర, ఆర్.బాలకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లి కార్జున, జీవరత్నం, శ్రీనివాసులు, రామ్మూర్తి, కె.సి.నారాయణ, నర్సింహులు, భూమిరెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లికార్జున, పాపన్న, రెడ్డెప్ప పాల్గొన్నారు.

రైతుల పాలిట ఆపద్బాంధవుడు నజ్మద్దీన్

ప్రజాశక్తి - కలకడ

రైతుల పాలిట ఆపద్బాంధవుడుగా నజ్మద్దీన్ నిలిచారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండల కేంద్రమైన కలకడలో నజ్మద్దీన్ టమోటా మార్కెట్‌ను కలిగి ఉన్నారు. ఈ క్రమంలో మండలంలోని పలు పంచాయతీలలోని రైతులు నజ్మద్దీన్ కలిగి ఉన్న మార్కెట్‌లో టమోటాలను విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో రైతులు వేసిన టమోటా పంటకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు ప్రస్తుతం టమోటా పంటకు ధరలు తగ్గిపోవడంతో అప్పులు పాలైన రైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతూ ఉండటం గమనించిన నజ్మద్దీన్ నందు టమోటాలు విక్రయించి నష్టపోయిన రైతులకు ఒక్కొక్కరికి రూ.7550 నగదు రూపంలో సుమారు 41మంది రైతులకు రూ.3.10లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టమోటా మండి యజమానులు, రైతులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకూ వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి.కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని పిహెచ్‌సి పరిధిలో దిగువపల్లి పంచాయతీలోని రంగప్పగారి పల్లె, దిగువపల్లి పంచాయతీలోని దిగువపల్లి వైద్యాధికారి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులకు ఇచ్చే కార్డు సంపూర్ణంగా పూరించాలని, గ్రోత్‌కార్డ్ విటమిన్ ఎ ప్రాధాన్యతను ఖచ్చితంగా అందించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రతి గ్రామంలో వ్యాధులను నియంత్రించడం వచ్చిన అన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జి. జయరామయ్య, ఎంఎల్ హెచ్‌పిలు అశ్విని ఆరోగ్య కార్యకర్త, ఆర్ శివప్రసాద్ బాబు, డేటాఎంట్రీ ఆపరేటర్ రోజా, సూపర్‌వైజర్ రమేష్‌బాబు, ఆశా కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

వైసిపి నాయకుడిని పరామర్శించిన 'గడికోట'

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలం సుద్దమల్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు చింతల జనార్దన రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రాయచోటి పట్టణం వినాయకవీధిలో ఉన్న చింతల జనార్దనరెడ్డిని బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకులు పల్లపు రమేష్, దేవా ఉన్నారు.



హార్సిలీహిల్స్ డెవలప్మెంట్ అథారిటీ సభ్యులు

ప్రహరీ నిర్మాణానికి ఆమోదం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ లోని స్కౌట్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి హార్సిలీ హిల్స్ డెవలప్మెంట్ అథారిటీ మంగళవారం హార్సిలీహిల్స్‌లో జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. మదనపల్లి ఆర్‌డిఒ మురళి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి విచ్చేసి ప్రసంగించారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులతో పాటు రాయలసీమ జిల్లాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర క్రింది నుంచి హార్సిలీహిల్స్ చేర్చడానికి అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తామని అయితే ఆరు నెలల లోపల అభివృద్ధి కనపడాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ సీనియర్ గైడ్ కెప్టెన్ శకుంతల,జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, ట్రైనింగ్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కబ్ మాస్టర్ చంద్రశేఖర్, భూపతి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయాన్ని సందర్శించిన 'ఆర్ఆర్'

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని కొండమూలలో వెలసిన చౌడేశ్వరి ఆలయాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్‌కుమార్‌రెడ్డి సందర్శించి పూజలు చేశారు. ఉగాది పండుగ ఉత్సవాలు పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం కొండమూల గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా కొండమూల మూలలోని గ్రామస్తుల కోరిక మేరకు బుధవారం రమేష్‌కుమార్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి సీనియర్ టిడిపి నాయకులు నరసారెడ్డి, రాయచోటి మండల టిడిపి అధ్యక్షులు మురళీనాయుడు సుబ్బారెడ్డి, చిన్నమండెం మండల టిడిపి ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహకకార్యదర్శి హెచ్ అమరనాథరెడ్డి, రాజంపేట రైతు విభాగ ఉపాధ్యక్షుడు చెన్న కృష్ణారెడ్డి, కొండ మూల టిడిపి గ్రామ నాయకులు రామచంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లపై విచ్చలవిడిగా పశువుల సంచారం

అధికారుల ఆదేశాలు పట్టని పశు యజమానులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలో పశువులు, పందులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులకు, ప్రజలకు ఆటంకాలు కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అడపా దడపా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయి. ఇటీవల కాలంలో రాజంపేట పట్టణంలో పశువుల విహారం మరీ శృతి మించుతోంది. కడప, తిరుపతి ప్రధాన రహదారితో పాటు వీధుల్లో సైతం అడ్డదిడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పశువులు రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న కారణంగా ప్రమాదాలను నివారించేందుకు గోసంరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో గోవుల కొరకు నీటి తొట్లతో పాటు పశు గ్రాసం కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పశువులు ఆ ప్రాంతానికే పరిమితం అవ్వకుండా ప్రధాన రహదారిలోనూ, పురవీధుల్లోనూ తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

పట్టణంలో పశువుల బెడదపై మున్సిపల్ అధికారులు స్పందించి పశు యజమానులకు కొంత గడువు ఇచ్చి, గడువు లోపల తమ పశువులను తీసుకెళ్లాలని, రోడ్లపై వదలకుండా జాగ్రత్తలు పాటించాలని నోటీసులిచ్చారు. ఆదేశాలను అతిక్రమిస్తే తామే స్వయంగా పశువులను పట్టి గోశాలకు తరలించడం జరుగుతుందని హెచ్చరించారు. అయినప్పటికీ పశు యజమానులలో స్పందన లేదు. అధికారుల ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలి వేస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను రోడ్లపై తిరగకుండా నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పశువుల బెడద నుంచి రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ములకలచెరువు : రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆయా పంచాయతీల యూనిట్ ఇన్‌ఛార్జిలు జెసిబి సుధాకర్‌నాయుడు, రమణమూర్తిలు అన్నారు. బుధవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శంకరయాదవ్ ఆదేశాల మేరకు మండల పార్టీ కన్వీనర్ పాలగిరిసిద్ద ఆధ్వర్యంలో మండలంలోని మద్దినాయునిపల్లె, పెద్దపాళ్యం, ములకలచెరువు పంచాయతీల్లో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వ్యతిరేకత పాలనపై కరపత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్, బస్‌ఛార్జీలు పెంచిన సామాన్యులపై భారం మోపిన ఘనత వైసిపిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలో నాయకులు చెన్నకేశవనాయుడు, రెడ్డెప్ప, శివన్న, చంద్రప్ప, రామలింగారెడ్డి, మల్రెడ్డి, ఉమాయికుమార్, హరి, కట్టా హరి, చెన్న క్రిష్ణ, కేశవులు, సోము, శ్రీనివాసులు, జి.రవి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ పరిధిలోని నీరుగట్టువారిపల్లెలో ఇటీవల మృతి చెందిన చేనేత కార్మికుడు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సభ్యులు పరామర్శించి తక్షణ సాయంగా రూ.5 వేలు అందించారు. ఇందులో భాగంగా బుధవారం నడిమిచెర్లలో మృతుడి సొంత గ్రామం వడ్డేపల్లి వెళ్ళి వారి తల్లి రెడ్డమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగాసాయికుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికులు అకస్మికంగా మరణిస్తే ప్రభుత్వం రూ.5లక్షలు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

శిశువుల శరీరాలు అధిక ఉష్ణోగ్రతలకు తేలిగ్గా గురౌతాయని పిల్లల సంరక్షణపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమానికి వచ్చిన బాలింతలు, గర్భిణులకు 'వడదెబ్బ-శిశు సంరక్షణ' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అధిక పగటి ఉష్ణోగ్రతల దృష్ట్యా పిల్లల దాహంపై తల్లులకు అనేక సందేహాలు తీర్చారు. ఆరు నెలల లోపు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లి పాల ద్వారానే వారి దాహం తీరుతుందని, వేడిని తట్టుకునే శక్తి శిశువులకు తల్లిపాలద్వారానే సాధ్యమని అన్నారు.కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పిహెచ్‌ఎన్ వెంకట సుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, సిహెచ్‌ఒ కుముద, ఎఎన్‌ఎం నాగవేణి, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-వీరబల్లి

ఆర్థిక లావాదేవీలు అత్యంత పారదర్శకంగా ఉండాలని వైఎస్ఆర్ క్రాంతి పథం సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి అన్నారు. శనివారం మట్లి, వడ్డేపల్లెలోని దేవాలయం ఆవరణంలో మట్లి గ్రామ సమాఖ్య 3 కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రతినెల గ్రామ సమాఖ్యలో రూ.2 లక్షల లావాదేవీలు జరుతాయని ఆమొత్తాన్ని అవసరాలకు సంఘాలకు రుణాలుగా ఇవ్వడం ద్వారా సభ్యులకు జీవనోపాదుల అవసరాలు తీర్చుకోవడానికి దాని ద్వారా సమాఖ్యకు ఆదాయం వస్తుందని అన్నారు. తీసుకున్న రుణాల ద్వారా ఇష్టమైన జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పని సమావేశాల్లో పొదుపులు, అప్పులు, పుస్తక నిర్వహణ విధిగా జరగాలన్నారు. లావాదేవీల నిర్వహణపై పదాదికారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్నిరకాల లావాదేవీలు సభ్యులకు తెలియజేసి మినిట్స్‌లో నమోదు చేయడం వల్ల పారదర్శక పెరిగి సమాఖ్యల బలోపేతం కావడానికి అవకాశం వస్తుందన్నారు. సిసిఎల్ పద్ధతిలో బ్యాంక్ రుణాలు సభ్యుల అవసరాలు ఎప్పుడైనా పొందడానికి వీలుంటుందని, రూ.లక్ష రూపాయలకు రూ.3వేలు కంతు చెల్లించడం వల్ల ప్రభుత్వ రాయితీ వడ్డీ వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిసి శంకర్‌నాయక్, సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, కార్యదర్శి సుజాత, కోశాధికారి రమాదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కలకడ

అక్రమంగా మట్టిని తరలించడంపై గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలం లోని స్థానిక కలకడ -కొత్తపల్లి సమీపంలో ఉన్న ధనగాని చెరువులో నుంచి మట్టిని అక్రమంగా తరలించడంపై స్థానిక గ్రామస్తులు జెసిబి, ట్రాక్టర్లను అడ్డుకొని నిలదీశారు. స్థానిక సర్పంచ్ కుమారుడు షావత్ అలీఖాన్ మండల స్థాయి అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా తనకు ఇష్టం వచ్చిన రీతిలో జెసిబిని ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కొని ఏర్పాటు చేసుకున్న ఇళ్ల ప్లాట్ల కోసం మట్టిని తోలడం దారుణమని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇంత జరుగుతున్న మండల స్థాయి అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మండల స్థాయి అధికారులు స్పందించి అనుమతులు పొందకుండా మట్టి, ఇసుకను తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఫ్రూట్ కవర్‌తో మామిడిలో అధిక దిగుబడి

నిమ్మనపల్లి : రైతులు ఫ్రూట్ కవర్ వాడడం ద్వారా మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వై.పీరు సాహెబ్ అన్నారు. బుధవారం వెంగంవారిపల్లిలో నరసింహులు గుప్తా, ఎడిఎ డాక్టర్ ఎం.వి.శ్రీకాంత్‌తో కలసి మామిడిలో ఫ్రూట్ కవర్ల ప్రాముఖ్యత, ఫ్రూట్ కవర్ల వినియోగం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్డు సైజులో ఉన్న మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు ఎలా కట్టాలి అనేది చేసి చూపించారు. మామడి తోటలోని కాయలను వివిధ పురుగులు, తెగుళ్ల ఆశించడం వల్ల నాణ్యత లేక రైతుకు సరైన మార్కెట్ ధర లభించదన్నారు. ముఖ్యంగా పండు ఈగ, తామర పురుగులు, కాయతొలుచు పురుగు, మసిమంగు తెగులు ఆశిస్తా యని చెప్పారు. కోతకు15నుంచి 20 రోజుల ముందు ఫ్రూట్‌కవర్ తొలగిం చడం వలన కాయలో ఉండే చక్కర స్థాయిని కొంత మెరుగు పరుచు కోవచ్చు న్నారు.కార్యక్రమంలో విహెచ్‌ఎ జయ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వేసవి కాలం ఎండ వేడిమికి అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో ఎప్పటికప్పుడు అవగాహన కలిగిస్తూ అగ్నిమాపక శాఖ అప్రమత్తం చేస్తూ వారం రోజు పాటు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పలు అపార్టుమెంట్లు, కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రి పెట్రోల్ బంక్, పాఠశాలల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భారీ అగ్ని ప్రమాదాల తీవ్రతను తగ్గించి ఆస్తులను, ప్రాణాలను కాపాడేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలను అగ్నిమాపక శాఖ అప్రమత్తం చేస్తుందని సుబ్బరాజు తెలిపారు. ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్, పెట్రోల్ బంక్‌లు, భవన సముదాయాలు, రద్దీ ప్రదేశాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. వాల్మీకిపురం పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే 9963737042కు సమాచారం అందించాలన్నారు. **ములకలచెరువు :** అగ్నిమాపక సేవలపై ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని లిడింగ్ ఫైర్‌మేన్‌లు కృష్ణయ్య, గణేష్‌కుమార్, వీరభద్రారెడ్డిలు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందికి అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రతలపై వారికి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

బి.కొత్తకోట : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని దర్గావీధికి చెందిన మున్నీ శారీ సెంటర్ దుకాణం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు బావాజీ, ఉపసర్పంచ్ మాలిక్‌లచే 65 మంది నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రంజాన్ కానుక కింద దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో షబానా,నౌషాద్,షాహుల్,సోనీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట : 2023 ఫిబ్రవరి 5న 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న శివసాయిరెడ్డి, కౌశిక్ ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12,000లు చొప్పున 9వతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎల్లయ్య

పీలేరు : పీలేరు వ్యవసాయ మార్కెట్ చెందిన ఎల్లయ్యను నియమిస్తూ ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్వర్వులు వచ్చాయి. ఎల్లయ్యకు ఈ పదవి రావడంలో కంభంవారిపల్లి మండలం ఈద్ లీడర్ గజ్జల సీన్‌రెడ్డి, జడ్‌పిటిసి శృతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఫాతిమా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష ఆచరించే ముస్లిం ఉపాధ్యా యులు, ఉద్యోగుల కోసం యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు సదాశివరెడ్డి, శివారెడ్డి, చంద్రశేఖర్, జాబీర్‌బాషా, రాధాకృష్ణ, చెంగారెడ్డి, అక్రంబాషా, వెంకటరమణ, సుధాకర్, వెంకటరమణా రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గుండ్లపల్లి పంచాయతీలో డీలర్, ఎండియులు కార్డుదారులకు బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేదని కార్డుదారులు బుధవారం తహశీల్దార్ కళావతికి ఫిర్యాదు చేశారు. ఎండియు రాజశేఖర్ నాయుడు పనితీరు బాగాలేదని కార్డు దారులకు ఏమైనా అడిగితే నిర్లక్ష్యం సమాధానాలు చెబుతూ ఇప్పటికే రెండుసార్లు బియ్యం పంపిణీ చేయలేదన్నారు. సమగ్ర విచారణ జరిపి బియ్యం పంపిణీ సక్రమంగా చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ సంబంధిత డీలర్‌తో ఫోన్లో సంప్రదించారు. రెండు రోజుల్లో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో బోజ్జిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నారాయణమ్మ, సరోజమ్మలు ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అవినీతిని బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సీతమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. ఇందిరమ్మ కాలనీలో జరిగిన అవినీతిపై సభలో సభ్యులు ధ్వజమెత్తారు. రోజుకొక స్థలాన్ని కైవసం చేసుకుంటూ అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దొంగ పట్టాలను సృష్టించి నిరుపేదలను పొట్ట కొడుతున్నారని ఇంద్రమ్మ కాలనీలో జరిగిన అవినీతిని బహిర్గతం చేయాలని ఎంపిటిసి ఖదీర్ సభ దృష్టికి తెచ్చారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర మాట్లాడుతూ తక్షణమే ఇంటి పట్టాల రిజిస్ట్రర్లను అందించి అవినీతిని రూపుమాపాలని అధికారులకు సూచించారు.యోగేంద్ర మాట్లాడుతూ మండల స్థాయిలో మన ముఖ్యమంత్రి జగన్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలలోకి తీసుకు వచ్చే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.ఎంపీ మిథున్‌రెడ్డి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గడపగడప కార్యక్రమంలో ప్రజలే వారి వద్ద వెలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి, తహశీల్దార్ ఖాజాబీ, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ జిల్లా క్రికెట్ జట్టుకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-నందలూరు

కడప జిల్లా క్రికెట్ సీనియర్స్ విభాగంలో నలుగురు నందలూరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 21నుంచి కడప లోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరిగే సీనియర్స్ క్రికెట్ టీమ్‌కు క్రికెట్ అసోసియేషన్ వైఎస్ఆర్ డిస్టిక్ నందలూరు సబ్‌సెంటర్ నుంచి కె.మారుతి శంకర ఆచారి ,జాఫర్ అలి ఖాన్, అసిఫ్‌హుస్సేన్, యశ్వంత్ ప్రధాన ఆటగాళ్లుగా, ఆదిల్ హుస్సేన్ స్టాండ్ బైగా ఎంపికయ్యాడు. స్థానిక సబ్ సెంటర్ కోచ్‌లు హెడ్ కోచ్ సయ్యద్ గయజ్, అసిస్టెంట్ కోచ్ ఫైరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివ కోటి హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ సుబ్బరామరాజు

చైర్మన్ పదవికి సుబ్బరామరాజు సమర్ధుడు : ఎంపీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ముద్దులూరు సుబ్బరామరాజు సమర్ధుడని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా సుబ్బరామరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, క్షత్రియ నాయకులు శివరామరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు అరుదైన గౌరవంగా చైర్మన్ పదవిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. రైతుల కోసమే వారి అభ్యున్నతి కోసం మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసి రైతు సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ముద్దులూరు సుబ్బరామరాజు వైసిపిలో కీలకమైన వ్యక్తిగా ఉంటూ అందరి మన్ననలను పొంది ఉన్నత స్థాయికి ఎదగడం సుబ్బరామరాజుకు ఈ పదవి దక్కటం సంతోషమని అన్నారు. గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు పాడిపంటలకు ప్రసిద్ధి చెందిదని మార్కెట్ కమిటీచైర్మన్ గా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టే అన్ని పథకాలను రైతులకు అందే విధంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమన వర్మ, వైస్ ఎంపిపి రామిరెడ్డి ద్వజారెడ్డి, నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఆదిరాజు వేణుగోపాల్‌రాజు, సాయి కిషోర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సిడి నాగేంద్రయాదవ్, గునిశెట్టి ప్రశాంతి, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచులు దార్లచంద్రశేఖర్, సియ్యవరం విష్ణు, ఆనాల కవితా చెంగల్ రెడ్డి, యజ్ఞం చంద్రశేఖర్, గోపి, పి.సుబ్రహ్మణ్యం, రామరాజు, నాగేంద్ర రాజు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపాలిటీలోని మన్నూరు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషన్ అభియాన్ పథకంలో భాగంగా సామాజిక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ హనుమంతు రమేష్ పాల్గొని ఆరు నెలలు నిండిన చిన్నారుకు అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అందజేసే బాలామృతం పిల్లలకు తప్పకుండా తినిపించాలని తెలిపారు. ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయని చెప్పారు. పిల్లలకు తప్పనిసరిగా ఆధార్‌కార్డు చేయించి అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు.

చిన్నారులకు అన్నప్రాస చేస్తున్న హనుమంతు

బిసిలంతా టిడిపికి అండగా నిలవాలి

ప్రజాశక్తి-నందలూరు

బిసి లందరూ ఐక్యంగా కృషిచేసి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు అన్నారు. బుధవారం నెల్లూరులో జరిగిన బిసి ఐక్య వేదిక సభలో బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్రను కలిసి భవిష్యత్తులో పార్టీ ఏ విధంగా బలపడాలో అందుకు బిసి లందరూ ఐక్యంగా కలిసి ఎలా కృషిచేయాలో చర్చించామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలంతా ఏకతాటిపై నిలిచి టిడిపి విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలిచెర్లలోని ఎస్ విఎస్ కళ్యాణ మండపంలో మూడవ విడత ఆసరా నిధుల చెక్కును మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. జగన్మోహన్ కలిచెర్ల సొసైటీ బ్యాంక్ చెర్మెన్ కడప సూదహర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర ముఖ్యమైందని అన్నారు. మండలంలోని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువలు పూర్తి చేసి చెరువులకు నీరు వచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుక వచ్చారు. అనంతరం 616 మహిళ సంఘాలకు రూ.5.26 కోట్ల రూపాయల చెక్కును వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వెలుగు పీడీ సత్యానారాయణ, ఎసి సురేష్ కుమార్, తహశీల్దార్ నిర్మాలదేవి, ఎంపిడిఒ శ్రీధర్ రావు, ఎంఇఒ మనోహర్, ఎపిఒ మురళి, ఎంపిపి పూర్ణ చంద్రిక రమేష్, జడ్‌పిటిసి పీరమ్మ దొరస్వామి, కో-ఆప్షన్ సభ్యులు ఖాదరవల్లి, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ రషీద్‌బేగం, జెవి ఎస్ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపిపి ప్రసాదరెడ్డి, మాజీ జడ్‌పిటిసి రమేష్, సర్పంచ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి

క్రైం కార్నర్

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట రైల్వే స్టేషన్‌లో కడపకు వెళ్లే దారిలో సూచిక బోర్డుకు సమీపంలో రైలు కింద పట్టాల పై పడి వ్యక్తి దుర్మరణం పొందాడు. తల, శరీరం వేరుగా పడిపోవడంతో చూసినవారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. మృతుడు ఎల్ఐసి ఏజెంట్ కెవి.రమణయ్యగా గుర్తించారు. ఆయన వృత్తిరీత్యా రాజంపేటలోని నూనెవారిపల్లి లోని స్వగృహానికి అప్పుడప్పుడు వచ్చేవారని, ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. రమణయ్య స్వగ్రామం పుల్లంపేట మండలం వత్తలూరు సమీపంలోని బుగ్గ అగ్రహారంకు చెందిన వారిగా గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు సమాచారం. మృతి చెందిన విధానాన్ని బట్టి ఆత్మహత్యగా అనుమానాలు రేకెత్తి స్తున్నాయి. రేణిగుంట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్య, లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నిమ్మలపల్లి మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మేలుందొడ్డి పంచాయతీకి గోపిశెట్టిపల్లెకు చెందిన వెంకటరామయ్య (55) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంజునాథ్(30)తో కలిసి సెంట్రింగ్ సామాగ్రిని ట్రాక్టర్ లో లోడు చేసుకుని నిమ్మనపల్లికు వస్తుండగా మార్గమధ్యంలోని బోయకొండ సమీపంలో బండ్లపై గ్రామం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకటరామయ్య తీవ్రంగా గాయపడగా డ్రైవర్ మంజునాథ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.